www.prajasakti.com
# ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024
5
పశ్చిమ గోదావరి



## నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుండి ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జెడ్‌పి సిఇఒ కెఎస్‌ఎస్.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌ఎలు, ఎంపిలను స్థాయి సంఘాల్లోకి ఎన్నిక కార్యక్రమం, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

# కొల్లేరులో వసూల్ రాజాలు..!



**ఐదో కాంటూరు కింద ఉన్న చేపల చెరువులపై నేతల కన్ను**
**ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని హుకుం**
**వేలాది ఎకరాల నుంచి వసూళ్లకు రంగం సిద్ధం**
**జనసేన ప్రజాప్రతినిధి ఉన్నచోట టిడిపి నేతలదే పెత్తనం**
**చిన్నా, చితకా రైతులకు దిక్కుతోచని దుస్థితి**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరులో వసూళ్ల రాజాలు రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. కొల్లేరు గ్రామాల పరిధికి చెందిన ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు వసూళ్ల దందాకు తెరలేపినట్లు చెబుతున్నారు. ఐదో కాంటూరు కింద ఉన్న చేపల చెరువుల నుంచి ఎకరాకు రూ.15 వేలు చొప్పున మామూళ్లు చెల్లించాలని చెరువుల యజమానులకు హుకుం జారీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. కొల్లేరు గ్రామాల ఉన్న నియోజకవర్గాల్లోని నాయకులతో ఈ దందాకు పూనుకున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో చెరువులు తవ్వుకున్న చిన్నాచితక రైతుల్లో అయోమయం నెలకొంది. సొమ్ము చెల్లించకపోతే తీవ్ర ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. 2006లో అప్పటి ప్రభుత్వం 'ఆపరేషన్ కొల్లేరు' పేరుతో చేపల చెరువులను ధ్వంసం చేసింది. దీంతో కొల్లేరు గ్రామాల ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. దీంతో కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని కొల్లేరు ప్రజలు ఎన్నోఏళ్లుగా ఆందోళనలు, నిరసనలు చేపట్టడంతోపాటు, ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. 2014 ఎన్నికల్లో కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన టిడిపి, బిజెపి కూటమి తెలిపింది. భీమవరంలో జరిగిన ఎన్నికల సభలో అప్పట్లో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ సైతం కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక టిడిపి, బిజెపి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో కొల్లేరు ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దిద్దుబాటు చర్యలకు దిగిన అప్పటి టిడిపి కూటమి ప్రభుత్వం కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపింది. కేంద్రంలోని మోడీ సర్కార్ పట్టించుకోలేదు. దీంతో అనధికారికంగా ప్రజాప్రతినిధులంతా కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలకు సహకరించారు. కైకలూరు, ఉంగుటూరు, ఉండి, దెందులూరు నియోజకవర్గాల్లో కొల్లేరు ప్రాంతం విస్తరించి ఉంది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం కొల్లేరులో అనధికారికంగా చేపల చెరువుల తవ్వకాలను ప్రోత్సహించారు. ప్రజాప్రతినిధులే చేపల చెరువుల్లో వాటాలు తీసుకుని తవ్వించిన పరిస్థితి ఉంది. దెందులూరు నియోజకవర్గంలో కొల్లేరు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య చెరువుల తవ్వకాలు, వాటాల సొమ్ము కోసం వర్గాలు సైతం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కొల్లేరులో వైసిపి నాయకుల దందాపై అప్పట్లో తీవ్ర దుమారం రేగింది.

**ఇప్పుడు మరో రకం దందా..!**

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కూటమి పార్టీల నాయకులు కొల్లేరులో చేపల చెరువుల నుంచి దందాకు తెరలేపినట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. కొత్తగా చేపల చెరువుల తవ్వకాలకు ఇబ్బంది ఉండటంతో తవ్వకాలు జరిపిన చెరువుల నుంచి సొమ్ము వసూళ్లకు దిగినట్లు తెలుస్తోంది. ఐదోకాంటూరు కింద తవ్వకాలు జరిపిన చేపల చెరువుల యజమానులు ఎకరాకు రూ.20 వేలు చెల్లించాలని హుకుం జారీచేయగా, తర్జనభర్జనల అనంతరం ఎకరాకు రూ.15 వేలు చెల్లించాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఐదో కాంటూరు కింద వేలాది ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. దీంతో రూ.కోట్లలో వసూళ్ల దందా సాగనున్నట్లు చర్చ సాగుతోంది. ఆయా నియోజకవర్గ నాయకులకు సొమ్ము చేరేలా ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. జనసేన ప్రజాప్రతినిధి ఉన్న నియోజకవర్గంలో టిడిపి నేత చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఐదో కాంటూరు కింద ప్రజాప్రతినిధికి తెలిసే ఈ దందా జరుగుతుందో.. లేదా అనే చర్చ సైతం సాగుతోంది. వసూళ్ల దందా తెలిసి చిన్నచితక రైతులు తీవ్ర ఆలోచనలో పడ్డారు. సొమ్ము చెల్లించకపోతే ఫారెస్ట్ అధికారులను ఉసిగొల్పి ఇబ్బంది పెట్టే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ విధంగా సొమ్ము వసూలు చేయడం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా ఉందనే భావన ఆయా పార్టీల్లోని దిగువస్థాయి నేతల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పెద్దలు దీనిపై ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

# 31నే పింఛన్ల పంపిణీ

**అధికారులు, సిబ్బంది సిద్ధం కావాలి**
**జిల్లాలో 2,31,075 మందికి రూ.96.95 కోట్లు**
**పంపిణీ : కలెక్టర్ నాగరాణి**



ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 31నే ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ చేయాలని, దీనికి సంబంధించిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ నెల పెన్షన్ సొమ్మును ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. డిఆర్‌డిఎ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, లీడ్ బ్యాంక్ ఎల్‌డిఎం, జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ అధికారి తదితరులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. మండలస్థాయి ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని, ఎక్కడ ఇబ్బందులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మొదటి రోజే వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సూచించారు. పింఛన్ లబ్ధిదారులు సిబ్బందికి అందుబాటులో ఉండాలని కోరారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగడానికి వీల్లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# మాతృభాషతోనే మానవజాతి మనుగడ

**తెలుగు భాషను పరిరక్షిద్దాం..**
**భావితరాలకు అందిద్దాం**
**క్రీడలతో చదువులోనూ రాణింపు**
**జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి**

ప్రజాశక్తి - భీమవరం

మాతృభాషతోనే మానవ జాతి మనుగడ సాధ్యమవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో తెలుగు అధికార భాషా దినోత్సవం, జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష కమ్మదనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, తెలుగును ప్రేమిస్తే మన అమ్మను గౌరవించినట్లే అని అన్నారు. తెలుగు అభ్యున్నతికి పరిశోధనలు విరివిగా జరగాలన్నారు. దేశంలో హిందీ, బెంగాలీ తర్వాత తెలుగు మాట్లాడేవారే ఎక్కువగా ఉన్నారన్నారు. వ్యవహారిక భాషను కాపాడటానికి గిడుగు వెంకట రామ్మూర్తి పోరాటం చేశారన్నారు. నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకుని ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు చదువులోనూ రాణించగలమని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. టెన్త్ క్లాస్ టాపర్‌నైన తనకు ఇంటర్మీడియట్‌కు వచ్చేటప్పటికి ఆటలాడేందుకు అవకాశం లేకపోవడంతో, మానసిక ఒత్తిడికి గురై ఫలితాల్లో కొంత వెనుకబాటుకు గురైనట్లు గ్రహించానన్నారు. ప్రతి విద్యార్థీ ఏదోక ఆట ఆడాలన్నారు. పదో తరగతి విద్యార్థులు కూడా ఆటలు ఆడేలా చర్యలు తీసుకోవాలని డిఇఒకు సూచించారు. త్వరలో క్రీడా రంగానికి సంబంధించి జిల్లాలో మ్యూజియం ఏర్పాటుకు ఆలోచన చేయాలని జెసి క్రీడాప్రాధికార సంస్థ అధికారిని ఆదేశించారు. డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు మాట్లాడుతూ తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. అనంతరం జిల్లాలోని పాఠశాలల్లో నిర్వహించిన వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన జట్లకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డ్స్-2023 పేరిట అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఇఒ జి.నాగమణి, క్రీడ ప్రాధికార సంస్థ జిల్లా అధికారి ఎం.రాజేష్, జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ పిఎస్‌ఎం.మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

# స్వచ్ఛందమైతే నిర్బంధం, బలగాలు ఎందుకు?

**ఆకివీడులో ఇళ్ల తొలగింపుపై సిపిఎం**

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక ఐ.భీమవరం రోడ్డులో ఇళ్లను స్వచ్ఛందంగా నివాసితులే ఖాళీ చేశారనడం అవాస్తవమని, అదే నిజమైతే ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు, పెద్దఎత్తున బలగాల మోహరింపు ఎందుకో చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ ప్రశ్నించారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోపాలన్ మాట్లాడుతూ ఇళ్లను బుధవారం హడావుడిగా బలవంతంగా ఖాళీ చేయించారన్నారు. ముందు రోజు ఇళ్లు ఖాళీ చేసేందుకు పది రోజులు సమయం ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారని, అయితే బుధవారం ఉదయమే ఎంఎల్‌ఎ అధికారులను రంగంలోకి దింపి బలవంతంగా ఇళ్లు ఖాళీ చేయించారన్నారు. నివాసితులు స్వచ్ఛందంగా ఖాళీ చేస్తే తమ నేతలను పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం, గృహనిర్బంధాలు చేయడం, పెద్దసంఖ్యలో పోలీసు బలగాలను మోహరించడం ఏమిటని ప్రశ్నించారు. కాలుష్య నివారణ కోసం ఇళ్ల తొలగింపు అని ఎంఎల్‌ఎ చెబుతున్నారని, డెల్టాలోనే కాలుష్యం సమస్య తీవ్రంగా ఉందని, దీనిపై తమ పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందని, చేస్తోందని గుర్తు చేశారు. దుంపగడపలో విపరీతమైన కాలుష్యం ఉందని, మంచినీటి చెరువు చుట్టూ కాలుష్యం బాగా పెరిగిపోయిందని అన్నారు. అక్కడ ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడం దారుణమన్నారు. కాలుష్య నివారణకు తామూ సహకరిస్తామని, ఇళ్ల తొలగింపునకు గడువు మాత్రమే కోరామని తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు సందక సూరిబాబు, డోకల రవితేజ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జెఎన్‌వి గోపాలన్

# రుస్తుంబాదలో విషపుటీగల గూడు..!

**ఆందోళనలో స్థానికులు - తొలగించాలని అధికారులకు వేడుకోలు**

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రుస్తుంబాద గ్రామంలో లెప్రసీ హాస్పిటల్ ఎదురుగా కాలువ అవతల రోడ్డు పక్కన వ్యవసాయ పొలాల్లో ఉన్న ఒక మామిడి చెట్టుకు విషపుటీగల గూడు పట్టింది. ఈ ఈగలు అత్యంత ప్రమాదకరమని, గతంలో ఇటువంటివి పేరుపాలెం గ్రామంలో పశువులపై దాడి చేయగా పశువులు చనిపోయాయని రైతులు చెబుతున్నారు. మనుషులకు కుట్టిన సమయంలో తీవ్ర అస్వస్థతకు గురైనట్లు చెబుతున్నారు. స్థానికుడు ఆకన ప్రసాద్‌ను విషపుటీగ కుట్టడంతో అస్వస్థతకు గురై స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. 2004 డిసెంబర్‌లో సునామీ వచ్చాక తీరప్రాంతంలో ఈ విషపుటీగల సంచారం పెరిగిందని చెబుతున్నారు. గతంలో తీరప్రాంతమైన పేరుపాలెం తదితర గ్రామాల్లో ఈ విషపుటీగల గూడు తొలగింపు పనులను ఒఎన్‌జిసి సిబ్బందికి అప్పగించారు. ప్రస్తుతం రుస్తుంబాదలోని ఈ విషపుటీగల గూడును తక్షణం తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



విషపుటీగల గూడు

## మృతురాలి కుటుంబానికి పరిహారమివ్వాలని ధర్నా

**ఆకివీడు :** సకాలంలో సరైన వైద్యం అందక మృతి చెందిన దుంపగడపకు చెందిన ఎం.దుర్గాలహరి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మృతురాలి కుటుంబీకులు, బంధువులు, స్థానికులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ సాధారణ జ్వరానికి సైతం ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లలేక ప్రభుత్వాసుపత్రికి వస్తే విగతజీవిగా రావడం చాలా బాధాకరమన్నారు. దుంపగడపలో వచ్చిన జ్వరాలు ఏ రకమైనవో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బివి.వర్మ, డోకల రవితేజ, శ్రీను, సూరిబాబు, మృతురాలి తండ్రి రాఘవ, తల్లి, బంధువులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలని ధర్నా

**పెనుగొండ :** మలేరియా జ్వరాలతో పలు గ్రామాల్లో బాధపడుతున్న ప్రజలకు వైద్యం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సిపిఎం నేతలు ధర్నా నిర్వహించారు. అనంతరం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ బి.అనితాకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రతి 500 మంది జనాభాకు గ్రామాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించాలని, జ్వరాలు నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, శీలం ఏసు పాల్గొన్నారు..

# క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

**ఎపి నిట్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం**

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని ఎపి నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి వీరేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయని, విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. క్రీడలతో మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్ తీపర్తి మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో దేశం తరఫున పాల్గొని వరుసగా మూడుసార్లు బంగారు పతకాలను అందించిన హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యానచంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దేశ భక్తిని, క్రీడా స్ఫూర్తిని చాటిచెప్పిన ధ్యానచంద్ తరతరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పలు క్రీడా పోటీల్లో రాణించడంతోపాటు సంస్థకు పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పరిపాలనా భవనం నుంచి నిట్ తూర్పు ముఖద్వారం వరకు, అక్కడ నుంచి తిరిగి పరిపాలనా భవనం వరకు నడక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ రాముడు, సాస్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుల్లో గొరగనమూడికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన ఐదు పాఠశాలలకు క్రీడా ప్రతిభ అవార్డుల (స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులు) ప్రదానోత్సవం స్థానిక కలెక్టరేట్లో గురువారం నిర్వహించినట్లు గొరగనముడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.శ్రీదేవి తెలిపారు. వీటిలో తమ పాఠశాల వరుసగా రెండో ఏడాది ప్రథమ స్థానం సాధించిందని చెప్పారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డిఇఒ నాగమణి చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరించినట్లు చెప్పారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు సాధించిన సర్టిఫికెట్లు, ప్రతిభ ఆధారంగా ఈ అవార్డుల ఎంపిక జరిగిందన్నారు. ఈ అవార్డుల్లో శృంగశృక్షం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ద్వితీయ స్థానం, తోలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు తృతీయ స్థానం, తూర్పుతాళ్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు నాలుగోస్థానం, భీమవరం ఎస్‌సిహెచ్‌బిఆర్‌ఎం హైస్కూల్‌కు ఐదోస్థానం దక్కాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన స్వామి జ్ఞానానంద హైస్కూల్ విద్యార్థులను, పీడీ విజయలక్ష్మిని, ప్రధానోపాధ్యాయిని బి.శ్రీదేవిని గ్రామ సర్పంచి గొట్టుముక్కల శివాజీరాజు, ఎంపిటిసి పార్వతి కృష్ణకుమారి, పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

# ఆన్‌లైన్ క్విజ్ పోటీలను వినియోగించుకోవాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి**

ప్రజాశక్తి - భీమవరం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీలను కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన బ్యాంకర్స్ సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ క్విజ్ పోటీల గోడపత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలను కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా జిల్లాలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అందరూ దరఖాస్తు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఏ కళాశాల నుండైనా విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ముందుగా కళాశాల పేరు https://www.rbi90quiz.inలో రిజిస్టర్ అయిందో లేదో చూసుకోవాలని, లేనిపక్షంలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడి క్విజ్ పోటీల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ పోటీలో స్టేట్ రౌండ్లో మొదటి బహుమతి రూ. రెండు లక్షలు, రెండో బహుమతి రూ.లక్షా 50 వేలు, మూడో బహుమతి రూ.లక్ష అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే జోనల్ రౌండ్‌లో మొదటి బహుమతి రూ.5 లక్షలు, రెండో బహుమతి రూ.4 లక్షలు, మూడో బహుమతి రూ.3 లక్షలు అందించినునట్లు తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లను సెప్టెంబర్ 17వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఐ ఎజిఎం ఆర్‌కె.హనుమకుమారి, రీజనల్ హెడ్ యుబిఐ పి.సంగీత కుమారి పాల్గొన్నారు.

# బాలిక మృతిపై మరోసారి విచారణ

ప్రజాశక్తి - ఆకివీడు

ఇటీవల జ్వరంతో మండలంలోని దుంపగడపలో దుర్గాలహరి (16) మృతి చెందడంపై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మరోసారి విచారణ నిర్వహించారు. అయితే బాలిక ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి మృతి చెందే వరకూ ఏం జరిగిందనేది మరోసారి ఆరా తీశారు. అదే సమయంలో అక్కడికొచ్చిన బాలిక తల్లిదండ్రులతో బృందం మాట్లాడింది. వారు చెప్పదల్చుకున్న వివరాలు లిఖితపూర్వకంగా ఇవ్వాలని బృందం బాలిక తల్లిదండ్రులను కోరింది. ఈ విచారణ కొత్త అంశం ఏమీ లేకపోవడం గమనార్హం. బాలికను ఏలూరు రిఫర్ చేయడం, సాధారణ జ్వరమే అనడం పొంతన లేకపోగా సిహెచ్‌సి నుంచి బాలికను బయటికి తీసుకొచ్చిన గంటకే మృతి చెందడంపై అధికారుల బృందం సైతం సరైన నిర్ధారణకు రాలేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. సాధారణ జ్వరానికే బాలిక మృతి చెందిందా అని ప్రశ్నించిన మీడియాపైనా అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. ఈ విచారణ కమిటీకి సమన్వయకర్తగా డిసిహెచ్‌ఎస్ డాక్టర్ బి.సూర్యనారాయణ వ్యవహరించగా సభ్యులుగా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఒ.రవికుమార్, భీమవరం ప్రభుత్వాసుపత్రి పేథాలజిస్ట్ డాక్టర్ ఎస్.సాయికిరణ్మయి, స్థానిక ప్రయివేటు వైద్యులు డాక్టర్ శివరామకృష్ణంరాజు ఉన్నారు.

## వివి గిరి కళాశాలకు నాక్ బృందం

**ఆకివీడు:** గుజరాత్ సర్దార్ వల్లభాయ్ పటేల్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శిరీష్ కులకర్ణ ఛైర్మన్‌గా బృందం సమన్వయకర్త ఢిల్లీ జామియామిలియా ఇస్లామియా ప్రొఫెసర్ ఎస్‌ఎంకె క్వాద్రి, సభ్యులు, కర్ణాటక ఆర్‌విడి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌ఎస్ భారతీశ్వరావు నాక్‌పీర్ టీం గురువారం కళాశాలను సందర్శించారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు కళాశాలలో బోధన తీరును, తరగతుల పరిస్థితిని, కంప్యూటర్ ల్యాబ్, కళాశాల స్థితిగతులను, పరిశీలించారు. కళాశాల అధ్యాపకులు బందం సిబ్బందితో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుజాత, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించికోవాలని ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు వెంప గ్రామం కొత్తపేటలో గురువారం విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలపై అదనంగా వేస్తున్న విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈదా భూషణం, ఇంజేటి సామ్యూల్, బొబ్బనపల్లి సునీల్‌దాసు, పోలుకొండ కుటుంబరావు పాల్గొన్నారు.

**పెనుగొండ :** విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ పోరాటంలో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డికి నేతలు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2000లో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన మహా పోరాటంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కాల్పులకు బలైన అమరులకు నివాళులర్పిస్తూ మాట్లాడారు. ప్రజలందరూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాధనతో మంచి ఫలితాలు

ప్రజాశక్తి - నరసాపురం

నిత్యం సాధన చేయడం ద్వారా ఏ రంగంలోనైనా రాణించడంతోపాటు మంచి ఫలితాలు సాధించవచ్చని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ అన్నారు. గురువారం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎంబిఎ, ఎంసిఎ, బిసిఎ, బిబిఎల ఓరియంటేషన్ కార్యక్రమంలో కెఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారు ఉన్నతంగా ఎదిగేందుకు యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. ప్రిన్సిపల్ సురేష్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ఆయా బ్రాంచీల హెచ్‌ఒడిలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

ప్రజాశక్తి - పాలకోడేరు

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ పీడీ సుజాత రాణి హెచ్చరించారు. పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్, పంచాయతీ రాజ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులకు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఐసిడిఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పీడీ సుజాతరాణి మాట్లాడారు. గ్రామస్థాయి బాల్య వివాహ నిరోధక కమిటీ అంతా సమన్వయంతో పని చేయాలన్నారు. ఎండిఒ మురళీ గంగాధర్ మాట్లాడుతూ జిఎంఎస్‌కె అందరూ గ్రామస్థాయి బాల్య వివాహ నిరోధక కమిటీలో కీలక పాత్ర పోషించాలన్నారు. తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి మాట్లాడారు. బాల్య వివాహాలు జరగకుండా గ్రామాల్లో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిడిపిఒ వాణి విజయరత్నం మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మోహన్‌రావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు బాలా కుమారి, జి.పార్వతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుజాతారాణి

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సిఐ

**తాడేపల్లిగూడెం:**యువత మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో హెల్మెట్ వాడకం, డ్రగ్స్ దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు మాట్లాడుతూ యువత ట్రాఫిక్ నిబంధనలను పాటించి వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

**కాళ్ల:**మండలంలోని సీసలి గ్రామంలో మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. జనసేన సీసలి అధ్యక్షులు నూకల భోగేంద్రబాబు కుమార్తె నూకల దీక్షిత పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు వంద భోజనం కంచాలు, కేకు, చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టండి

**ఉండి:**బాల్య వివాహాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సలహాదారులు విజయలక్ష్మి అన్నారు. గురువారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాలపై పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల వారికి ఐకెపి ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం ఆధ్వర్యంలో ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సలహాదారులు విజయలక్ష్మి మాట్లాడారు. బాల్య వివాహాలపై కఠిన చట్టాలు ఉన్నాయని, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. సిడిపిఒ వి.వాణి విజయరత్నం మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాల్య వివాహ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల విస్తరణాధికారి మంద రామకృష్ణారెడ్డి, ఎఎస్ఐ సిహెచ్ రామారావు పాల్గొన్నారు.

## బాధితులకు మానవత సాయం

**ఆచంట:**ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు మానవత ముందుంటుందని సంస్థ మండల అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్ అన్నారు. కందరవల్లి గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కొరాని ఏసు కుటుంబానికి మానవత ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొల్లేపర వెంకన్న బాబు, ఛైర్మన్ నంబూరి అంజిబాబు, కో ఛైర్మన్ వేండ్ర శ్రీనివాస్ కన్వీనర్ ఉద్దగిరి కామేశ్వరరావు, కోశాధికారి తమ్మినీడి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

## జనవాణిలో అర్జీల స్వీకరణ

**ప్రజాశక్తి - నరసాపురం**

మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. గురువారం కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. మంత్రితో పాటు జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) ప్రజల వద్ద అర్జీలు స్వీకరించి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**నరసాపురం:**జనవాణి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ప్రధాన పార్టీ కార్యాలయంలో లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన యువకుడు పాత పురుషోత్తం హనుమ (18) ఇటీవల సముద్రంలో గల్లంతై మృతి చెందారు. కుటుంబ సభ్యులు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరగా, ప్రభుత్వ సహాయం చేస్తుందని, తన వంతుగా జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) రూ.20,000 ఆర్థిక సహాయం అందించారు. ప్రతిపాడు నియోజకవర్గం పాత మల్లయపాలెం గ్రామానికి చెందిన కట్ల రత్నకుమారికి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ దంపతులకు సత్కారం

**ప్రజాశక్తి - వీరవాసరం**

రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2021-2024 వరకు పేరెంట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన గుబ్బల సత్యనారాయణ, లక్ష్మి దంపతులను గురువారం రాయకుదురు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సత్యనారాయణ రాయకుదురు హైస్కూల్ అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ఆయన కూడా అనేక కార్యక్రమాల్లో తనవంతు సహాయ సహకారాలు అందజేశారు. ఆయన చేసిన సేవలకు గాను ఉపాధ్యాయులు ఆయనతో పని చేసిన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు, సర్పంచి గెద్దం భారతి, ఎంపిటిసి సభ్యులు కడలి నెప్రొలా, ప్రస్తుత పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ శల భవాని, వైస్ ఛైర్మన్ పంజా దుర్గా వెంకట గణేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

### ఎపిటిఎఫ్ 1938 జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి రమణ

**భీమవరం :**రాబోయే రోజుల్లో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్సి ఎన్నికలకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని ఎపిటిఎఫ్-1938 జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి రమణ కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ సంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు అర్హులని పేర్కొన్నారు. 2024 నవంబర్ 1వ తేదీ ముందు ఆరేళ్ళ, కనీసం మాధ్యమిక పాఠశాల, కళాశాలల్లో సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు నమోదు చేయించుకోవడానికి అర్హులన్నారు. అర్హులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫారం-19 దరఖాస్తులు మండల రెవెన్యూ కార్యాలయాల్లో, మండల విద్యా శాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి దరఖాస్తుదారు ఫారం-19 పూర్తిచేసి వారి దరఖాస్తుకు ఎస్ఆర్ జిరాక్స్ జోడించి ఉన్నతాధికారుల ద్వారా ధ్రువీకరించుకొని సంబంధిత మండల రెవెన్యూ కార్యాలయాల్లో, మండల విద్యా శాఖ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు.

## ఐదుగురిపై కేసు నమోదు

**తణుకు రూరల్:**ఉద్యోగ విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. తణుకు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అబ్దుల్ హమీద్ బుధవారం అర్ధరాత్రి విధి నిర్వహణలో భాగంగా తేతలి వద్ద వాహనాలపై బిల్లులు తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో ఉండ్రాజవరం వద్దూరు గ్రామానికి చెందిన మోపాటి సాయిసురేష్, మోపాటి శ్రీను, దులా రామకృష్ణ దుర్గాప్రసాద్, గవర దుర్గాప్రసాద్, లంక ఉమా దుర్గారావు హమీద్‌తో గొడవపడి విధులకు ఆటంకం కలిగించారు. ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ ఎస్ఐ జిఎస్.మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమపేరుతో మోసగించాడని ఫిర్యాదు

**నరసాపురం:**మండలంలోని రుస్తుంబాదకు చెందిన ఓ యువతి తనను ప్రేమ పేరుతో వ్యక్తి మోసగించాడని పోలీసులను ఆశ్రయించింది. నరసాపురం రూరల్ ఎస్ఐ టిబి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. తూర్పుగోదావరి జిల్లా మేడిచర్లపాలెనికి చెందిన కానూరి రవి కుమార్ తనను ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## కారు ఢీకొని వృద్ధుడు మృతి

**గణపవరం:**గణపవరంలో కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. మృతుడు కుమారుడు దాసి సుందరావు (75) గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఎస్సి పేటకు చెందిన దాసి వీరాస్వామి బుధవారం రాత్రి 10.50 నిమిషాలకు నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చి కారు వీరాస్వామిని ఢీకొనడంతో వీరాస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవర్ ఆకుల సూర్యచంద్రరావును అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మహిళ అదృశ్యం

**ఉండి:**మహిళ అదృశ్యంపై కేసు నమోదైన సంఘటన వాండ్రం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణపవరం గ్రామానికి చెందిన పోలాకి మాధవి వాండ్రం గ్రామంలోని కింగ్ వైట్ రొయ్యల ఫ్యాక్టరీలో పని చేస్తోంది. ఈ నెల 27వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుండి పనికి వెళ్లగా 28వ తేదీ ఉదయం 7 దాటినప్పటికి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త పోలాకి శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా తెలిపారు.



# నాణ్యమైన సీడ్, ఫీడ్ ఎంపిక చేసుకోవాలి

**ప్రజాశక్తి - కాళ్ల**

ఆక్వా రైతులు నాణ్యమైన సీడ్ ఫీడ్ ఎంపిక చేసుకోవాలని ఎంపెడా నుంచి ఎడి ఆనంద్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మత్స్యశాఖ, ఎంపెడా సంయుక్త ఆధ్వర్యంలో అప్సడా అనుమతులు, ఎంపెడా ఎన్రోల్మెంట్‌పై ఆక్వా రైతులకు అవగాహన సదస్సు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎంపెడా ఎడి ఆనందరావు మాట్లాడుతూ ఆక్వా రైతులు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఆక్వా రైతూ ఎంపెడా వద్ద ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఆక్వా రైతులు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా మంచి ఉత్పత్తులను పొందొచ్చన్నారు. గుర్తింపు పొందిన స్టాండర్డ్ హేచరీ వివరాలను ఆక్వా రైతులు ఎల్లప్పుడూ తెలుసుకోవాలన్నారు. ఇన్‌ఛార్జి ఎఫ్‌డిఒ సిహెచ్.రాంబాబు మాట్లాడుతూ ఆక్వా రైతులు అప్సడా అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. అనుమతులు లేని ఆక్వా రైతులు త్వరితగతిన నమోదు చేసుకోవాలన్నారు. కెవికె శాస్త్రజ్ఞులు శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరువు తయారీ విధానంలో తగు మెలకువలను పాటించాలన్నారు. సమావేశంలో ఆక్వా రైతులు, ఆక్వా డీలర్లు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

**మొగల్తూరు :** ఆక్వా రైతులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని మత్స్యశాఖ ఎడి సిహెచ్ వెంకటేశ్వరరావు సూచించారు. మొగల్తూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఆక్వా రైతులు, డీలర్లకు మత్స్యశాఖ, ఎంపెడా సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపి ఎస్‌ఎడిఎ అనుమతులు ఆక్వా రైతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎంపెడా ఎడి దుర్గారావు మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించి ఆక్వాసాగు చేయాలన్నారు. ఎంపిడిఒ ఉండ్రు బాబ్జి రాజు, మత్స్యశాఖ మండల అధికారి కె.వివేక్ మాట్లాడుతూ సీడ్, ఫీడ్ నాణ్యతను ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరిక్షించుకున్న అనంతరం వాటిని రైతులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు గంగరాజు, సత్యనారాయణ, కేసులు పాల్గొన్నారు.

# మాతృభాషను కాపాడుకోవాలి

**ప్రజాశక్తి - ఉండి**

మాతృభాషను భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వాడిపై ఉందని పలువురు వక్తలు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వై.రామలక్ష్మి అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి చిరస్మరణీయులు అని తెలిపారు. పరిపాలనాధికారి ఆర్.నరసరాజు మాట్లాడుతూ అత్యంత శక్తివంతమైన భాష తెలుగు అన్నారు. అనంతరం పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఈలి సుదర్శన్, కురెళ్ల శ్రీనివాస్, ఆర్.సుజ్ఞాన కుమారిని లయన్స్ క్లబ్ తరపున ఘనంగా సత్కరించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ ఎ.అరుణ కుమారిని సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు పెన్మెత్స రంగ ప్రసాదరాజు, బివిఆర్‌కె.సుబ్బరాజు, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నమ్మాల్వార్, మధుసూదన రావు, పద్మావతి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**గణపవరం :** కాశిపాడు హైస్కూల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవం, రాష్ట్రీయ బాలస్వస్త్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మలేరియా, డెంగీ జ్వరాలపై కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాలరాజు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరికైనా జ్వరం, దగ్గు, ఉంటే వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, నరశింహారావు, పిడి శ్రీనివాస్ రెడ్డి, వీరవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

**నరసాపురం:**తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తార్పుతాళ్ల ప్రాథమిక పాఠశాలలో గిడుగు వెంకట రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ జయంతులను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని క్రీడా పరికరాలను ప్రదర్శించి విద్యార్థులచే ఆటలాడించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని పాలపర్తి అరుణకుమారి మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ ఒలింపిక్స్‌లో భారతదేశానికి హాకీలో వరుసగా 3 బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ ఆటల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గృహలక్ష్మి, ఎస్.అజయ్‌కుమార్, బిఎల్ జె.గాంధీ, సిఆర్‌పి.బొక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానిక బాలికోన్నత పాఠశాలలో కాపు వనితా క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు పొందిన నరసాపురం గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి, బాలికోన్నత పాఠశాల పిఇటి ఉపాధ్యాయిని ఇందిరావాణిని క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, వనితా క్లబ్ రీజనల్ ఛైర్ పర్సన్ శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తల్లి వంటి తెలుగు భాషను మర్చిపోతున్నారని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వనితాక్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి, కార్యదర్శి బండి స్వర్ణలత, కోశాధికారి రంగినీడి భరణి పాల్గొన్నారు.

బిజిబిఎస్ మహిళ కళాశాల వద్ద గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని తెలుగు విభాగాధిపతి ఎస్.చంద్రకళ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ విచ్చేసి గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. తెలుగు భాషను గ్రాంధిక భాష నుంచి వ్యవహారిక భాషగా మార్చిన మహోన్నతుడు గిడుగు రామూర్తి అన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు భాష తీయదనాన్ని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.మధుషాలిని, అధ్యాపకులు కె.రజిని, టిఎల్ఎస్.మనోహరి, జి.రాధ, సిహెచ్.రోజా పాల్గొన్నారు.


నరసాపురం : మాట్లాడుతున్న శ్రీనివాస్

**పాలకొల్లు :** దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎన్.కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు, ప్రముఖ జ్యోతిష్యులు మధుర మురళీ కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, నోబుల్ రాజ్ జూలియా, ప్రసన్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

**భీమవరం టౌన్ :** శ్రీవిజ్ఞానవేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు భాషా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమాన్ని భీమవరం జెఎల్‌బి గరల్స్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. 56 మంది తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. 6,7 తరగతి విద్యార్థులు ప్రదర్శించిన బుర్రకథ అందరినీ ఆలోచింపజేసింది. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు, జెఎల్ బి.మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పిబి.శ్రీనివాస్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన 56 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

**తణుకు :** ఎస్‌విఎస్ స్కూల్ ప్రాంగణంలో గిడుగు వెంకటరామమూర్తి జయంతిని, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు మాట్లాడారు. తెలుగు భాష వైభవానికి పునాదులు వేసిన మహనీయుడు గిడుగు అన్నారు. స్కూల్ డైరెక్టర్ ద్విభాష్యం కేశవరావు మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కలగ రామ్‌కుమార్, మిద్దే సూరిబాబు, మండెల నాగమణి పాల్గొన్నారు.

# ఘనంగా క్రీడా దినోత్సవం

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

శశి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్మరించుకుంటూ కళాశాలలో 2కె రన్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మహమ్మద్ ఇస్మాయిల్ 2కె రన్ ప్రారంభించారు. ఈ పరుగు పందెంలో సుమారు 250 అథ్లెట్స్ పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత క్రీడాకారులలకు పరిచయం అక్కర్లేని పేరు ధ్యాన్‌చంద్ అన్నారు. కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ భారత హాకీ ఇంద్రజాల నైపుణ్యాన్ని ప్రపంచమంతటా చాటి చెప్పి, దేశానికి ఒలింపిక్స్‌లో మెడల్స్ తీసుకొచ్చిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్స్ లెఫ్టినెంట్ పిఎస్.శేఖర్ పాల్గొన్నారు.

**పాలకొల్లు :** జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహరావు మాట్లాడుతూ భారతదేశపు గొప్ప హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్ అన్నారు. పిల్లలు చిన్నతనం నుండే ఆటలపై శ్రద్ధ పెడితే పరస్పర సహకారం నాయకత్వ లక్షణాలు గెలుపోటములను సమానంగా స్వీకరించడం అలవాటు పడతాయని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ జక్కంపూడి మదన్, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, కానూరు ప్రభాకర్ పాల్గొన్నారు.

**తణుకు :** క్రీడలతో గెలుపు, ఓటమితో పాటు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటామని సిఐ కొండయ్య అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ కళాశాల వద్ద జిల్లా స్థాయి రన్నింగ్ పోటీలు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ అధ్యక్షతన పోటీలు నిర్వహించారు. బాలుర పోటీలను సిఐ కొండయ్య, బాలికల పోటీలను అసోసియేషన్ ఛైర్మన్ మానేపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా అధ్యక్షులు బి.జాన్సన్ మాట్లాడారు. అనంతరం తణుకు రూరల్ ఎస్ఐ జిఎస్.మూర్తి గెలపుపొందిన వారికి ట్రోఫీలు అందజేశారు. ఈ పోటీలకు నర్సింహమూర్తి బహుమతులు స్పాన్సర్ చేయగా, సర్టిఫికెట్స్ మద్దాల శ్రీనివాస్ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ బాబూరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.సత్యనారాయణ, కె.సుబ్బారావు, ఎ.నాగేశ్వరరావు, కె.వెంకన్నబాబు పాల్గొన్నారు.

**పెనుమంట్ర :** మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా మార్టేరు వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ కర్రి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా 80 దశకం ఆంధ్ర యూనివర్సిటీ అథ్లెటిక్స్ ఛాంపియన్, పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు చిర్ల సూర్యనారాయణ రెడ్డి, పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న జాతీయస్థాయి బాస్కెట్ బాల్ క్రీడాకారుడు మల్లుల సుధాకర్‌ను అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు సత్తి సుబ్బన్నరెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

**భీమవరం టౌన్ :** ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు, ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ రాజు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు జాతీయ పతాకాలతో కళాశాల ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు.

# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు జనసేన యువనేత రాజేష్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన మాగంటి లలితాంబ కళ్యాణ మండపంలో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వెయ్యి యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని చెప్పారు. 5 బ్లడ్ బ్యాంకుల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మెడిటేషన్‌లో ఉన్నవారు ఈ రక్తదాన శిబిరాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, గట్టు గోపీకృష్ణ, నీలిపాల దినేష్ పాల్గొన్నారు.

**ఆచంట :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఐదు రోజులపాటు వేడుకలు నిర్ణయిస్తున్నట్లు జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్ తెలిపారు. మొదటిరోజు వల్లూరు పంచాయతీ పరిధి గెద్దాడవారిపాలెం, కాంబోట్లపాలెం ఎలిమెంటరీ పాఠశాలల్లో విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్, కలర్ పెన్సిల్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, జనసేన గ్రామ అధ్యక్షులు కడిమి ఉమామహేశ్వరస్వామి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - పాలకోడేరు**

గొరగనమూడి సబ్ స్టేషన్ వద్ద 11 కెవి వద్ద విస్సాకోడేరు ఫీడర్ కటింగ్ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్న నేపథ్యంలో విస్సాకోడేరు, గొరగనమూడి గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## యండగండిలో 'పొలంబడి'

**ప్రజాశక్తి - ఉండి**

రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గిస్తూ మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఉత్పత్తి చేసే ఆహార ఉత్పత్తులకు అధిక లాభాలు ఉంటాయని ఆకివీడు సహాయ వ్యవసాయ సంచాలకులు కెఎఎస్-ఎస్.శ్రీనివాస్ అన్నారు. గురువారం యండగండిలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అధ్యక్షతన నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడారు. రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిరోధక కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి - యలమంచిలి**

మండలంలోని దొడ్డిపట్లలో బాల్య వివాహాలను నిరోధించేందుకు నూతనంగా 11 మంది సభ్యులను ఒక కమిటీగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గ్రామ పంచాయతీ సర్పంచి సిహెచ్ ప్రమీలాకుమారి, పంచాయతీ కార్యదర్శి టి.పార్వతి, గ్రామ రెవెన్యూ అధికారి ఎ.నాగరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.సత్యనారాయణ, గ్రామ సమాఖ్య మెంబర్ ఉమాదేవి, గ్రామ వార్డు మెంబర్ ఎన్.అనిత, సచివాలయ ఎఎన్ఎం నాగలక్ష్మి, ఎన్‌జిఒ జి.మోహన్‌రావు, యువ మహిళా మెంబర్ కె.వరలక్ష్మి, ఎడబ్ల్యుడబ్ల్యు వి.పద్మశ్రీ, ఎంఎస్‌కె.మల్లిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం

**ఉండి:**ప్రకృతి సేద్యంతో ఆరోగ్యంగా ఉంటారని ఉండి డివిజన్ ఎన్ఎఫ్ఎ మహేష్ అన్నారు. గురువారం పెద్దపుల్లేరులో ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయడంతో అధిక ఆదాయాన్ని పొందొచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండే పంటలకు బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. అనంతరం 18 రకాల బయోకల్చర్, కోడిగుడ్డు, నిమ్మరసం కలిపి 10 ఎకరాల్లో డ్రోన్‌తో పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి మొగ్గ దుర్గ, ప్రకృతి వ్యవసాయ విభాగం సభ్యులు మూల రాజేశ్వరి పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు రక్షణ కల్పించాలి

**పాలకొల్లు :**రాష్ట్రంలో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వేగంగా విస్తరిస్తున్న క్రమంలో పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు తగు రక్షణ కల్పించాలని తహశీల్దార్‌కు ఎస్ఎఫ్ఐ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పాలకొల్లు పట్టణ కో - కన్వీనర్ సిహెచ్.సతీష్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, పారిశుధ్య లేమి తదితర కారణాలతో రాష్ట్రంలో అనేక మంది పిల్లలు డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలకు గురికావడం ప్లేట్లెట్లు కోల్పోవడం, హాస్పిటల్ పాలవడం వంటివి జరుగుతున్నాయని తెలిపారు. వాటిని అరికట్టడానికి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, ప్రభుత్వ వసతి గృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.నవీన్, బి.పవిత్ర, బి.శృతి పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి శిశు సంక్షేమంపై అవగాహన

**పెనుగొండ:**మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని నక్కా శ్యామలాసోని అన్నారు. ఈ సందర్భంగా గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళల అభివృద్ధి, శిశు సంక్షేమంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ టి.రత్నాకరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

## అమ్మ పేరుతో మొక్క నాటండి

**ఉండి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమ్మ పేరుతో ఒక మొక్క అనే గ్లోబల్ ప్రచారాన్ని ప్రారంభించిందని, అందులో భాగంగానే ఉండి కషి విజ్ఞాన కేంద్రంలో మామిడి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.